ప్రజాశక్తి
శనివారం 25 మే 2024
5
శ్రీ సత్యసాయి

గుమ్మఘట్టలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, జెడిఎ

పుర(౦)పాలికలో డీజిల్ దొంగలు..!

◆ ఫాగింగ్ చేయకుండానే ఇంధనం కొనుగోలు చేసినట్లు బిల్లులు ◆ ఈ తంతు వెనుక హస్తం ఎవరిది..?

రహమత్‌పురం ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త దిబ్బలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలికలో డీజిల్ దొంగలు పడ్డారు. కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శించి ఇంధనం రూపంలో లక్షల్లో డబ్బులు కాజేశారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపాల్టీ ఆధ్వర్యంలో వినియోగించే వాహనాలు నడుపుతున్న డీజిల్, పెట్రోల్ లెక్కల్లో గోల్ మాల్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. పురపాలక సంఘం పరిధిలో మొత్తం 12 వాహనాలు ఉన్నాయి. వీటికి నెలకు సఘటున రూ.5 లక్షల మేర ఇంధనాన్ని ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఖర్చులో తప్పుడు లెక్కలు చూపించి పెద్ద మొత్తంలో దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వాహనాల్లో డీజిల్ పోసే సమయంలో మున్సిపల్‌కు చెందిన ఒకరు స్వయంగా పర్యవేక్షించాల్సి అవసరం ఉంటుంది. వాహనం తిరిగే పరిధిని లెక్కల్లోకి తీసుకుని ఇంధనం పోయించాల్సి ఉంటుంది. ఒక్క వాహనాకి సైతం మీటర్లు పని చేయక పోవడంతో ఎన్ని ట్రిప్పులు తిప్పినారు.. ఎన్ని కిలో మీటర్లు వాహనాలు తిరిగాయన్నది ఎవరికీ తెలీయదు. డ్రైవర్లులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ కలిసి తప్పుడు రీడింగ్ నమోదు చేస్తూ ఇంధనం పోయించుకున్నట్లు తప్పుడు లెక్కలు నమోదు చేస్తూ డబ్బులు కాజేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

హిందూపురం సెలక్షన్ గ్రేడ్ పురపాలక సంఘంలో పట్టణంలో వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను కంపోస్టు యార్డుకు తరలించేందుకు మొత్తం 12 వాహనాలున్నాయి. ఇందులో 8 ట్రాక్టర్లు, రెండు చిన్న కాంప్యాక్టర్లు, ఒకటి పెద్ద కాంప్యాక్టర్‌తో పాటు ఫాగింగ్ కోసం ఒక వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 11 వాహనాలు రోజు ఎంతో కొంత తిరుగుతున్నాయి. ఫాగింగ్ కోసం ఏర్పాటు చేసిన వాహనం మాత్రం ఎక్కడా తిరగదు, ఫాగింగ్ సైతం ఏక్కడ చేయరు. నెలకు సగటున రూ.80 వేలు ఖర్చు చేస్తున్నట్లు మున్సిపల్ పారిశుధ్య విభాగంలో లెక్కలు ఉన్నాయి. చిన్న కాంప్యాక్టర్లు వినియోగం కోసం నెలకు రూ. 1.60 లక్షలు ఖర్చు చేస్తున్నారు. పెద్ద కాంప్యాక్టర్ నిర్వహణ కోసం నెలకు సగటున రూ.30వేల వరకు వీటితో పాటు 8 ట్రాక్టర్ల నిర్వహణ కోసం సఘటున రూ. 3లక్షల వరకు మొత్తం నెలకు రూ.6 లక్షల వరకు డీజిల్, పెట్రోల్ కోసం మున్సిపల్ నిధులను ఖర్చు చేస్తున్నారు. ఈ ఖర్చు గత సంవత్సరం డిసెంబర్-జనవరి మధ్యలో మున్సిపల్ కార్మికులు 15 రోజులు సమ్మె చేశారు. ఆ సమయంలో వాహనాలు బయటకు సైతం రాలేదు. సమ్మెలో సైతం వాహనాలు తిరిగినట్లు రికార్డులు చూపించి డీజిల్, పెట్రోల్ కొనుగోలు చేసినట్లు బిల్లులు సృష్టించి మున్సిపల్ నిధులను దిగమింగారు. ఈ బిల్లులు గత సంవత్సరం జూన్ వరకు నెలకు సగటున డీజిల్, పెట్రోల్ బిల్లు రూ.2.50లక్షలు మాత్రమే ఉంది. ఈ బిల్లు ఒక్క సారిగా జూలై నెల నుంచి రూ.5.50లక్షలకు పెరిగింది. వాహనాలు పెరగలేదు, వాహనాలు తిరిగే ట్రిప్పుల సంఖ్య సైతం గతం కన్నా తగ్గింది. అయినప్పటికీ డీజిల్ బిల్లు మాత్రం 100 శాతం పెరిగింది.

డీజిల్, పెట్రోల్ వేయకుండానే వేసినట్లు బిల్లులు

హిందూపురం పురపాలక సంఘంలో చెత్త తరలించే వాహనాల్లో ఏ వాహనానికీ స్పీడ్ మీటర్ లేదు. దీంతో ఎన్ని కిలో మీటర్లు తిరిగిందన్న లెక్కలు ఉండవు. దీంతో పారిశుధ్య అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగ మారింది. బంకులో పని చేసే వారితో అధికారులు కలిసి వారికి కమిషన్ పోగా మిగిలిన నగదును తీసుకుని, పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోల్ వేయకుండానే వేసినట్లు బిల్లులు తీసుకుని మున్సిపల్ నిధులు దోచేస్తున్నారు. నిబంధనల మేరకు చెత్తను కంపోస్టు యార్డుకు తరలించే సమయంలో లోడింగ్, అన్ లోడింగ్ చేసే సమయంలో ఏ విధంగా ఛాయచిత్రాలు తీస్తారో....అదే విధంగా డీజిల్, పెట్రోల్‌ను వాహనాలకు వేసే సమయంలో తప్పని సరిగా ఛాయాచిత్రాలను తీయాల్సి ఉన్నప్పటికి అలా చేయడం లేదు.

పని తక్కువ... దోచుడు ఎక్కువ..!

పురపాలక సంఘం పరిధిలో చెత్తను కంపోస్టయార్డుకు తరలించేందుకు మొత్తం 12 వాహనాలున్నాయి. వీటిని పట్టణంలోని నాలుగు డివిజన్‌లలో ఉపయోగిస్తారు. ఈ వాహనాలు ఏ డివిజన్‌లో ఎన్ని చెత్త కుప్పలను కంపోస్టు యార్డుకు తరలించాయో... అక్కడున్న చెత్త దిబ్బలకు తప్ప ఎవరికీ తెలియదు. ఆ వాహనాలకు రోజూ వంద లీటర్ల వరకు డీజిల్ పోస్తున్నారు. ఒక్కో వాహనం కనీసం మూడుసార్లయినా కంపోస్టుయార్డుకు వెళ్లాలి. రెండు సార్లు కూడా తిరగడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో పాటు పట్టణంలో చెత్తదిబ్బలు ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. పని మాత్రం తక్కువ ఉన్నప్పటికీ వాహనాల నిర్వహణకు మాత్రం లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. ఈ తతగం వెనుక ఎవరి హస్తం ఉందన్న విషయం తెలియాలంటే దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారులతో విచారణ చేయిస్తే అవినీతిడొంక బయట పడే అవకాశం ఉందనే వాదన విన్పిస్తోంది.

అనంతలో విత్తన పంపిణీ ప్రారంభం

ఇప్పటికి నిలువ సగంలోపే..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో వేరుశనగ విత్తనకాయల పంపిణీ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ శుక్రవారం నాడు గుమ్మగట్ట మండలంలో విత్తన పంపిణీని ప్రారంభించారు. విత్తనకాయల పంపిణీకి ఆశించినంత స్పందన కనిపించడం లేదు. గతేడాది వర్షాభావ పరిస్థితులు, ఈ ఏడాది విత్తనం కొనుగోలుకు డబ్బుల్లేకపోవడం వంటి వాటితో రైతులు వేరుశనగ సాగుపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది 76 వేల క్వింటాళ్లు వేరుశనగ విత్తన పంపిణీ చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈనెల 18వ తేది నుంచి విత్తనం అవసరమైన రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకుని నాన్ సబ్సిడీ మొత్తాన్ని రైతు భరోసా కేంద్రాల్లో చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం గ్రామాల వారీగా విత్తనకాయలను రైతులకు అందజేయనున్నారు. ఇప్పటి వరకు చూస్తే జిల్లాలో 40,704 మంది రైతులు మాత్రమే విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అనంతపురం జిల్లా వరకే చూస్తే దాదాపు రెండు లక్షల మంది వరకు రైతులున్నారు. ఇప్పటి వరకు జరిగిన విత్తన రిజిస్ట్రేషన్లు 40,704 మాత్రమే.

ఆలస్యంగా విత్తన సేకరణ

విత్తన సేకరణ కూడా ఆలస్యంగానే ప్రారంభమైంది. సార్వత్రిక ఎన్నికలుండటంతో అధికార యంత్రాంగం మొత్తం ఆ పనుల్లో ఉన్నారు. అవి ముగియగానే విత్తన పంపిణీపై దృష్టి సారించారు. ఎపి సీడ్స్ ఆధ్వర్యంలో విత్తన సేకరణ ప్రారంభమైంది. శుక్రవారం నుంచి పంపిణీ చేపట్టనున్నారు. ఒకవైపు వర్షాలు కూడా పడుతుండటంతో ఎప్పుడులేనంత డిమాండ్ ఉంటుందని ఆశించినప్పటికీ అనుకున్నంత ఉత్సహం రైతుల్లో కనిపించడం లేదు. ఇప్పటి వరకు 32,850 క్వింటాల్ల విత్తనకాయలను రైతు భరోసా కేంద్రాల్లో నిలువ ఉంచారు. తక్కినది రాబోయే రోజుల్లో పూర్తి చేసేందుకు ఎపి సీడ్స్ చర్యలు చేపట్టింది.

సబ్సిడీ మొత్తం కాజేయకుండా చర్యలుండేనా .?

గతేడాది ఇదే రకంగా రైతులు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో విత్తన సేకరణ సంస్థలకు వరంగామారింది. విత్తనకాయలు కావాలని రిజిస్ట్రేషన్ చేసిన రైతులు తీసుకోని నాన్ సబ్సిడీ మొత్తాన్ని విత్తన సేకరణ యజమానులు కట్టేసి పంపిణీ పూర్తి చేసినట్టు చూపించి సబ్సిడీ మొత్తాన్ని కాజేశారు. ఇది సత్యసాయి జిల్లాలో అత్యధికంగా జరిగింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో దీనిపై అధికారులు విచారణ కూడా చేపట్టారు. పెద్దగా చర్యలేవి లేకుండానే ముగించారు. ఇటువంటి అక్రమాలకు ఈసారి ఏ రకంగా అధికారులు కట్టడి చేస్తారన్నది చూడాల్సి ఉంది. సమయం తక్కువగా ఉండటం, ఎన్నికలు కూడా జరుగుతున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించకపోతే గతేడాదిలాగానే కొంత మంది సబ్సిడీ మొత్తాన్ని కాజేసే అవకాశాలున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సబ్సిడీపై పంపిణీ చేస్తున్న విత్తన నాణ్యతపైనే అనేక సందేహాలు రైతుల్లో ఉన్నాయి. సర్టిఫైడ్ విత్తనం కాకుండా ఇప్పుడు పంపిణీ చేస్తున్న ట్రూత్‌ఫుల్ లేబుల్డ్ సీడ్. దీనికి జర్మినేషన్ పరీక్షలు జరపాల్సి ఉంది. గతేడాది ఇవి కూడా సక్రమంగా జరగలేదన్న ఆరోపణలున్నాయి. దీనిపైనా అధికారులు ఈసారి తగిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

27 నుంచి పాలిటెక్నిక్ కౌన్సిలింగ్

హిందూపురం : 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాలిటెక్నిక్ ప్రవేశాలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిందని పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ హరీష్‌బాబు శుక్రవారం తెలిపారు. ఈ నెల 27 నుంచి జూన్ 3వ తేదీ వరకూ ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సిలింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 24 నుంచి జూన్ 2వ తేదీ లోగా ఫీజు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నెల 31 నుంచి జూన్ 5వ తేదీ వరకూ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించారని తెలిపారు. 7న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. జూన్ 10వ తేదీలోగా విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో సెల్ఫ్ జాయినింగ్ అయి కళాశాలలో రిపోర్టు చేసుకోవాలన్నారు. జూన్ 10వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇతర వివరాలకు పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

డిప్లొమా ఇన్ ఫార్మసీ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

హిందూపురం : పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో రెండేళ్ల డి-ఫార్మసీ కోర్సులో (2024-25 విద్యా సంవత్సరం) ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎన్.హరీష్ బాబు శుక్రవారం తెలిపారు. ఈ నెల 21 నుంచి జూన్ 15వ తేదీ వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రెగ్యులర్, ఓపెన్ ఇంటర్మీడియట్ బైపిసి, ఎంపిసిలో ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులన్నారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం లేదా తెల్ల రేషన్ కార్డు కలిగిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు గవర్నమెంట్ అడ్మిషన్ ఫీజు మినహాయింపు, స్కాలర్‌షిప్ సౌకర్యం ఉందన్నారు. విద్యార్థినులకు కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఇంటర్, తత్సమాన మార్క్స్ మెమో, పదో తరతి మార్క్స్ మెమో, స్టడీ సర్టిఫికెట్లు(6వ తరగతి నుంచి), కుల ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్(అర్హత కలిగిన ఓసీ అభ్యర్థులు మాత్రమే) పాస్‌ఫొటోతో పాటు అప్లికేషన్ రుసుం రూ. 400తో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల హిందూపురంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 98662 73402, 97038 43680 మొబైల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రొద్దం : మండలంలోని శ్రీసాయి రూరల్ డెవలప్మెంట్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం(నేడు) రొద్దం సాయి విద్యా మందిర్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు తెలిపారు. రొద్దంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరంలో హిందూపురం పట్టణంలోని శ్రీఆశ్రయ మల్టీ స్పెషల్ హాస్పిటల్ సిబ్బంది కిడ్నీ సంబంధిత జబ్బులకు చికిత్స అందిస్తారని తెలిపారు. హిందూపురంలో ఇదే వైద్య సిబ్బంది ద్వారా చికిత్స పొందడానికి వేల రూపాయల ఖర్చు అవుతుందని, అలాంటిది మన సొంత మండలంలో నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డిఎంహెచ్ఓ మంజువాణి

ప్రజాశక్తి-అగళి

వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఓ మంజువాణి సూచించారు. ఆమె శుక్రవారం మండలంలోని అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. గత వారంలో రొళ్ల మండలంలోని కాకి, బ్యాడిగెర పంచాయతీల్లో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉండటం, కొందరికి విరేచనాలు, వాంతులు ఎక్కువగా కావడంతో ఆ పంచాయతీలోని రొళ్ల, అగళి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో గ్రామాల్లో ఇంటింటి సర్వే చేయించారు. జ్వరం రాకుండా విరేచనాలు కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే వైద్య సేవలు అందించారు. ఈ క్రమంలో శుక్రవారం డిఎంహెచ్ఓ మంజువాణి మండలంలో ఆకస్మికంగా పర్యటిం చారు. అగళి మండలంలోని అన్ని పంచాయతీల్లో ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట డాక్టర్ శివనందు, సిబ్బంది ఉన్నారు.

డిఎంహెచ్ఓ మంజువాణిని సన్మానిస్తున్న పిహెచ్‌సి సిబ్బంది

స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలంలోని బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పరిశీలించారు. ఆయన అక్కడ భద్రతాపరమైన అంశాలను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జూన్ 4వ తేదీ జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన పోయిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు వహిస్తూ పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. లాగిన్ బుక్‌లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, కదిరి ఆర్‌ఓ వంశీకృష్ణ, మడకశిర నియోజకవర్గ ఆర్‌ఓ గౌరీశంకర్, తదితరులు ఉన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రంలో సౌకర్యాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

సమయపాలన పాటించని పిహెచ్‌సి సిబ్బంది

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని నీలకంఠాపురం గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్‌సి)లో పని చేసే ఉద్యోగులు విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఏమాత్రం సమయపాలన పాటించడంలేదు. మధ్యాహ్నం 3 గంటలకే విధులకు డుమ్మా కొట్టి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఈ పిహెచ్‌సిలో దాదాపు 5 మంది విధులు నిర్వర్తిస్తుండగా మధ్యాహ్నం 3 గంటలకే అందరూ ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. కార్యాలయంలో ఒక ఫార్మాసిస్టు, ఒక స్టాఫ్ నర్స్ తప్ప మరెవరూ పూర్తి సయమం కనిపించరు. పిహెచ్‌సి పరిధిలో వివిధ విభాగాలకు సంబంధించిన సిబ్బంది ఉదయం 9 గంటలకు విధులకు హాజరై సాయంత్రం 5 గంటల వరకూ కార్యాలయంలో ఉండాలి. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకే పిహెచ్‌సి సిబ్బంది ఇంటికి వెళ్లిపోయారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే పిహెచ్‌సి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పిహెచ్‌సి సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



నీలకంఠాపురంలో పిహెచ్‌సిలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

చెన్నేకొత్తపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠినచర్యలు తప్పవని ఎస్ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఎస్ఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ 100 మందికి పైగా బైండోవర్ చేశామన్నారు. బైండోవర్ ప్రక్రియ జూన్ 4వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. గ్రామాల్లో ఎంతటి వారైనాఅల్లర్లు, గొడవలు సృష్టించడానికి ప్రయత్నిస్తే నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తామన్నారు. అవసరమైతే రౌడీషీట్ ఓపెన్ చేయడం లేదా జిల్లా బహిష్కరణకు వెనకాడబోమన్నారు. ప్రస్తుతం 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. కావున గ్రామాల్లో గుంపులుగా ఉండరాదన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పెట్రోల్ బంకుల యజమానులు వాహనాల్లో ట్యాంకులకు తప్ప విడిగా బాటిళ్ళు, క్యాన్లలో పెట్రోలు, డీజిల్ పట్టరాదన్నారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జూన్ 6వ తేదీ వరకూ ఎక్కడా ఎలాంటి టపాసులు అమ్మరాదు, వినియోగించరాదన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలు అదుపులో ఉండేందుకు, ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మండలంలోని మేడాపురం పంచాయతీ పెద్దమొగలాయపల్లి గ్రామంలో శుక్రవారం శతాధిక వృద్ధురాలు ఓబుళమ్మ మృతిచెందారు. ఓబుళమ్మ వయస్సు సుమారు 110 సంవత్సరాలు. ఈమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. ఆమె తుదిశ్వాస విడిచేంత వరకూ సంపూర్ణ ఆరోగ్యంగానే జీవించారు. అయితే వయసు రీత్యా శుక్రవారం ఉన్నఫళంగా మృతిచెందారు. ఈమె నాలుగు తరాలు వారసులను చూసింది. మండలంలోనే అత్యంత ఎక్కువ కాలం జీవించిన వృద్ధురాలిగా ఊరి ప్రజలు పేర్కొంటున్నారు. ఆమెకు గౌరవప్రదంగా సంతోషంగా అంతిమ వీడ్కోలు పలికారు. ఆమె భౌతిక కాయాన్ని దాదాపు గ్రామస్తులందరూ సందర్శించి నివాళుర్పించారు.

ఓబుళమ్మ(ఫైల్‌ఫొటో)

పడకేసిన పారిశుధ్యం..!

తీవ్రమైన దోమల బెడద.. అనారోగ్యం బారిన ప్రజలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని పలు గ్రామాల్లో డ్రైయినేజీ కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోవడంతో దోమల బెడద తీవ్రమై ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రధానంగా మండలంలోని ఉద్దేహాల్, బొమ్మనహాల్, గోవిందవాడ, శ్రీధరఘట్ట గ్రామాల్లో డ్రైయినేజీ కాలువలను శుభ్రం చేయడకపో వడంతో చెత్తచెదారం పేరుకుపోయింది. దీంతో మురుగునీరు ముందుకు కదలక నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమల బెడద తీవ్రమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఆయా గ్రామాల్లో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో డ్రైయినేజీ కాలువలు నిండి మురికినీరు రోడ్లపై ప్రవహిస్తోంది. అయినా అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ఇకనైనా అధికారులు స్పందించి డ్రైయినేజీ కాలువల్లో చెత్తచెదారం తీయించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి ఎంపిడిఒను వివరణ కోరగా మా దృష్టికి రాలేదని సమాధానం దాటవేశారు.

డ్రైయినేజీ కాలువలో పేరుకుపోయిన చెత్తచెదారం

వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని అధికారులు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రామాంజనమ్మ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆది, సోమవారం వర్షాలు కురిసే అవకాశం ఉందని, మండల వ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి ప్రమాదం జరుగకుండా గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పశువులు, మనుషులకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించడానికి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారి సాయికుమార్, పిహెచ్‌సి వైద్యాధికారి వెంకట్‌రెడ్డి, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

లేఅవుట్లలో అవినీతిపై విచారణ చేయండి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల పట్టాల పంపిణీ, లేఅవుట్ల ఏర్పాటులో అవినీతి, అవకతవకలపై విచారణ జరపాలని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి, ఆ పార్టీ రాయదుర్గం అసెంబ్లీ అభ్యర్థి చిందనూరు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు నాగరాజు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రాయదుర్గం పట్టణంలో బిటి ప్రాజెక్ట్ మోడల్ కాలనీ లేఅవుట్ ఏర్పాటు సమయంలో భూ యజమాని నుంచి అధికార పార్టీ నాయకులు తక్కువ ధరకు పొలాన్ని కొనుగోలు చేసి అధిక ధరకు ప్రభుత్వానికి విక్రయించారన్నారు. దీనివల్ల రైతు తీవ్రంగా నష్టపోయారని, అతడికి న్యాయం చేయాలని కోరారు. బిటిపి రోడ్డు లేఔట్‌లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 1.57కోట్లు వసూలు చేసి భూ యజమానికి రూ. 36 లక్షలు మాత్రమే అందజేశారన్నారు. అవినీతి, అవకతవకలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, భూమి యజమానులకు న్యాయంగా అందాల్సిన పరిహారం అందించాలని నాగరాజు డిమాండ్ చేశారు. అంతేగాక నియోజకవర్గంలో లేఅవుట్ల ఏర్పాటులో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని కోరారు. ఆయనతో పాటు బీఎస్పీ అనంతపురం జిల్లా అధ్యక్షులు నాగభూషణం ఉన్నారు.

కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కోరి నాగరాజు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పదేళ్లుగా బొమ్మనహాల్ మండలంలో పంట నష్టపరిహారం కానీ, పంటల బీమా పథకం కానీ అమలు కాలేదని వాపోయారు. కేవలం ఓ వ్యక్తి ఇచ్చిన పత్రికా ప్రకటన మేరకు మండలానికి రావాల్సిన పంట నష్ట పరిహారం, పంటల బీమా ఆగిపోయాయన్నారు. త్వరలో ఏర్పడనున్న నూతన ప్రభుత్వమైనా, ముఖ్య మంత్రి అయినా, రాయదుర్గం ఎమ్మెల్యే అయినా నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నాగరాజు విజ్ఞప్తి చేశారు.

కాయ్ రాజా కాయ్

అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగ్‌లు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి నియోజకవర్గంలో తెలుగుదేశం, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు ఓటములపై ఎవరు ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. వైసిపి వారు తమ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా ఆకర్షణ పథకాలతోనే గెలుపు ఖాయమైందని అభ్యర్థి శ్రీధర్ రెడ్డి దీమా వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లామని దీంతో ప్రజలు టిడిపిని గెలిపిస్తారని టిడిపి పుట్టపర్తి నియోజకవర్గ అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి దీమాతో ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రత్యేక హోదా ఇస్తామన్న దానికి కట్టుబడ్డామని ఇదే ఎన్నికల్లో ప్రజల ముందు ఉంచామని దీంతో తమకు ఓటర్లు అనుకూలంగా ఉన్నారని కాంగ్రెస్ అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి నమ్మకంతో ఉన్నారు. ఇరు పార్టీల వారితో విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఫలితాల కోసం జూన్ 4 వరకు కాలక్షేపం కోసం నాయకులు, అభ్యర్థులు విహార యాత్రలకు వివిధ ప్రాంతాలకు తరలి వెళ్లారు. పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఎప్పుడూ లేనంత గా ఎక్కువ పోలింగ్ శాతం 84.11 నమోదయింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాలకు గాను 13 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, 291 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. వాటిలో 50 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకం కాగా వాటిపై పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఉంచారు. అభ్యర్థుల గెలుపోటములపై ప్రజలు, నాయకులు తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూస్తున్న తరుణంలో పలువురు ఇరు పార్టీల నేతలు తమ అభ్యర్థి గెలుస్తారని బెట్టింగులు కడుతున్నారు. గ్రామాల్లో సైతం బెట్టింగులు జోరు కొనసాగుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా 2,11,062 ఓటర్లకు గాను 1,82,093 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 90,962 మంది పురుషులు, 91,126 మంది స్త్రీలు, ఐదుగురు ఇతరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో భద్రపరిచారు.

2019 సార్వత్రిక ఎన్నికలలో పుట్టపర్తి వైసిపి అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి 31276 ఓట్ల మెజార్టీతో పల్లె రఘునాథ్ రెడ్డి పై విజయం సాధించారు .అప్పట్లో కొత్తచెరువు మండలంలో 4414, బుక్కపట్నం మండలంలో 6800, పుట్టపర్తి మండలంలో 1069, నల్లమాడ మండలంలో 8744, ఓడిసి మండలంలో 7342, అమడగూరు మండలంలో 2346 ఓట్ల మెజారిటీ వైసిపి అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి విజయం సాధించారు. ప్రతి మండలంలోనూ మెజార్టీ సాధించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సైతం కొద్దిగా మెజార్టీ తగ్గినా విజయం తమనే వరిస్తుందని వైసిపి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కానీ ఈసారి ఎన్నికలలో ప్రజలు ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకతతో ఉన్నారని ఆ వ్యతిరేక ఓట్లే టిడిపిని విజయ తీరానికి చేరుస్తుందని తెలుగుదేశం నాయకులు దీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో వారి భవితవ్యం పట్ల ఓటర్లు సమాధానం ఎలాగుందో జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు : కలెక్టర్

సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, అదరపు రిటర్నింగ్ అధికారులతో తొలి విడత అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వివిధ దశల్లో పాటించాల్సిన నిబంధనలను, తీసుకోవలసిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్ఒకొండయ్య, రిటర్నింగ్ అధికారులు భాగ్యరేఖ, వెంకట శివ సాయి రెడ్డి, గౌరీ శంకర్, వంశీకృష్ణ, జిల్లాలోని వివిధ మునిసిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పూర్తిచేయాలని సొంత నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. చిన్న పొరపాటుకు కూడా తావు ఇవ్వద్దని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి తమకు కేటాయించిన విధులను పూర్తి చేయాలని ఆదేశించారు. అందుకోసం సమగ్ర అవగాహన కల్పించుకోవడానికే ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లాలోని హిందూపురం పార్లమెంటు, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలను హిందూపురం సమీపంలో బిట్ కళాశాల నందు మడకశిర, పెనుకొండ, కదిరి, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు అలాగే పార్లమెంట్ నియోజకవర్గానికి కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న చేపట్టడం జరుగుతుందన్నారు. లేపాక్షి మండలంలోని చోళ సముద్రం సమీపంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు పుట్టపర్తి అసెంబ్లీ, ధర్మవరం అసెంబ్లీ సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లను ఏర్పాటు చేయడం జరిగిందని రాప్తాడు సంబంధించి 21 రౌండ్లు, మడకశిరకు సంబంధించి 19 రౌండ్లు, పుట్టపర్తి కి 18 రౌండ్లు, ధర్మవరం, కదిరి నియోజకవర్గాలకు 21 రౌండ్లు కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే హిందూపురానికి 19 రౌండ్లు, పెనుకొండకు 19 రౌండ్లు కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందని అందువల్ల సిబ్బంది ఆరు గంటలకే తమకు కేటాయించిన లెక్కింపు కేంద్రాలకు చేరుకొని అంతా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలలో సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఒకవైపు ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు మరోవైపు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి లెక్కింపు కేంద్రంలోనూ వీడియో రికార్డింగ్ కూడా నిర్వహిస్తామని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డును ధరించాలని చెప్పారు. గుర్తింపు కార్డులు లేకపోతే లోపలకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు తొలి విడత లెక్కింపు మలివిడత లెక్కింపు ప్రక్రియలను వివరించారు. కౌంటింగ్ హాలులో రిటర్నింగ్ అధికారిదే సర్వాధికారమని వారే పూర్తిగా నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియలో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గానికి పోలైన ఓట్లను ప్రత్యేకంగా కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎన్నికల తహశీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న డిఆర్ఒ, ఎఎస్పీ

ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

డిప్యూటీ ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఉద్యోగాలకు ఏపీపీఎస్సీ చేపట్టే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో డిఆర్ఒ మాట్లాడుతూ శనివారం ఈ పరీక్షలను ప్రశాంతి గ్రామ్ బీడుపల్లికి వెళ్లే రోడ్డులో గల సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 110 మంది హాజరు కాబోతున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్, ట్యాబ్స్, ఐప్యాడ్, బ్లూటూత్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, హ్యాండ్ బ్యాగులు, రైటింగ్ ప్యాడ్లు అనుమతి లేదన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు ఈ పరీక్షల నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు 7:30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఇస్తామన్నారు. ఉదయం 8:30 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. విద్యుత్ సరఫరా లో ఎలాంటి అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏపీపీఎస్ సెక్షన్ ఆఫీసర్లు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో బుద్ధ పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలులో రెండవ రోజు శుక్రవారం బుద్ధ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం సత్య సాయి మహా సమాధి వద్ద గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పలు దేశాలకు చెందిన బౌద్ధులు జయ మంగళ గాధ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ తోపాటు ట్రస్టు సభ్యులు, సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, జపాన్, శ్రీలంక, తైవాన్, దావోస్, నేపాల్ తదితర దేశాల నుంచి వచ్చిన పలువురు బౌద్ధ సన్యాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బౌద్ధుల గురువు భిక్షుఉత్తరో మాట్లాడుతూ బుద్ధ భగవానుడు సమాజంలో శాంతి, ప్రేమ, కరుణ, దయ చూపించారని బోధించారన్నారు. ప్రపంచవ్యాప్తంగా శాంతిని కాంక్షిస్తూ పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. శాంతి తోనే సౌభాగ్యం చేకూరుతుందన్నారు. సాయంత్రం బుద్ధ భగవాన్ బోధించిన బోధనలను ఉట్టిపడే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ వేడుకలను ప్రశాంతి నిలయంలో బాబా సన్నిధిలో జరుపుకోవడం ఆనందంగా ఉందని బౌద్ధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బౌద్ధులు, సత్య సాయి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న బౌద్ధులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్పీ

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించబోమని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఎన్నికల నిబంధనలు అందరూ పాటించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నారని ప్రజలంతా సహకరించాలని సూచించారు. ఇందులో భాగంగా శుక్రవారం సమసాత్మకమైన ప్రాంతాలలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారన్నారు. పత్రాలు లేని అనుమానిత వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్లో సిఐలు, ఎస్ఐలు సిబ్బందితో తనిఖీలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో, తర్వాత కూడా జిల్లాలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతిభద్రతలను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎన్నికల కౌంటింగ్ వరకు నిరంతరం నిఘా ఉంచామని, జిల్లాలలో ఎక్కడా బాణాసంచా విక్రయించరాదని, పెట్రోల్ బంక్ సిబ్బంది, యజమానులు విడిగా బాటిల్స్ లోగాని, క్యాన్ లలో గాని పెట్రోల్, డీజిల్‌లను నింపరాదని హెచ్చరించారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పుట్టపర్తి క్రైమ్ :జూన్ 4 కౌంటింగ్ నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సిఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెంగళమ్మ చెరువు, బ్రాహ్మణపల్లిలో తనిఖీలు చేపట్టారు. గడ్డివాములు, ఇల్లు పరిసరాల్లో సోదాలు నిర్వహించారు. కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాలలో ఘర్షణలు, గొడవలు తలెత్తకుండా ప్రజలు ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, ఎఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం : కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు, గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి కంజాక్షన్ రాజకీయ పార్టీల నాయకులకు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని వన్ టౌన్ స్టేషన్ లో డిఎస్‌పి కంజాక్షన్, వన్, టూ టౌన్ సిఐలు శ్రీనివాస్, రీయాజ్ ఆహ్మద్‌లతో కలిసి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కౌంటింగ్ కు ముందు, కౌంటింగ్ సమయంలో పట్టణంలో ఏలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. వచ్చే నెల 6వ తేది వరకు పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉందని, గెలచిన వారు బాణసంచాలు కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు, సభలు నిర్వహించరాదన్నారు. వీటిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఐలతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రశాంతి గ్రామం సమీపంలో సీజనల్ వ్యాధులు ,అడల్ట్ బిసిజి వ్యాక్సిన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ వ్యాక్సిన్‌తోక్షయ వ్యాధి నిర్మూలించవచ్చునని తెలిపారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తి గత శుభ్రత, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని చెప్పారు. డ్రైడే ఫ్రైడే పాటించి జ్వరాల బారిన పడకుండ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సబ్ యూనిట్ అధికారి రమణయ్య, సూపర్‌వైజర్ వెంకటరమణ, ఎస్‌టిఎస్ అబీద్, ఆరోగ్య కార్యకర్త అమృత, ఆశా కార్యకర్త అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించండి

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండల కేంద్రంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని సిపిఎం రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కొందరి అధికారుల వైఖరి చూస్తుంటే కబ్జారాయుళ్లకు కొమ్ముకాస్తున్నట్లు అనుమానంగా ఉందన్నారు. ప్రభుత్వ భూమి అని బోర్డు కూడా ఏర్పాటు చేయడానికి అధికారులకు తీరిక లేకుండా ఉందని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ఆందోళనలకు దిగాల్సివస్తుందని హెచ్చరించారు.

నాట్యప్రదర్శనలో వాల్మీకి పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి కదిరి అర్బన్

జాతీయ స్థాయి శాస్త్రీయ కూచిపూడి జంట నృత్య ప్రదర్శనలో కదిరి పట్టణంలోని వాల్మీకి పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనపర్చి ద్వితీయ స్థానంలో నిలిచారు. వాల్మీకి పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న మాన్యశ్రీ, మనస్విని కూచిపూడి నృత్యంలో జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్లు వాల్మీకి పాఠశాల ప్రతినిధి అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. వాల్మీకి పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు జాతీయస్థాయిలో పేరు, ప్రఖ్యాతలు సాధించినందుకు స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చైతన్య పాఠశాలపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

వేసవి సెలవుల్లో అక్రమంగా అడ్మిషన్లు నిర్వహించి పాఠ్యపుస్తకాలను అమ్మకాలు నిర్వహిస్తున్న చైతన్య పాఠశాల యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరేంద్ర, జిల్లా కార్యదర్శి పోతులయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ కొత్తచెరువు లోనే పెనుగొండ రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు అడ్మిషన్లు నిర్వహించి విద్యార్థులకు పుస్తకాలను అమ్మకాలు కొనసాగిస్తున్నారన్న సమాచారంతో పాఠశాలకు వెళ్లి పరిశీలించామన్నారు. అమ్మకానికి ఉంచిన పుస్తకాలను స్వాధీనం చేసుకుని డిఇఒకు ఫిర్యాదు చేశామన్నారు. స్పందించిన డిఇఒ ఎంఇఒను పాఠశాల వద్దకు పంపారన్నారు. దీంతో ఎంఇఒ జయచంద్ర పాఠశాలను తనిఖీ చేసి పాఠ్య పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేశారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు నిర్వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు ప్రభుత్వ నిబంధన మేరకే ఫీజులు వసూలు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి, నందకిషోర్, అజయ్, పాల్గొన్నారు.

పుస్తకాలున్న గదిని సీజ్ చేస్తున్న ఎంఇఒ

పంచాయతీ కార్యదర్శి ఇంట్లో చోరీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని దశరథరామయ్య కాలనీలో నివాసం ఉంటున్న హిందూపురం రూరల్ మండలంలోని కొటిపి పంచాయతీ కార్యదర్శి సుభాషిని నివాసంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సుభాషిని పట్టణంలోని డిఆర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. నాలుగు రోజుల క్రితం అనంతపురం వెళ్లారు. ఇది గమనించిన దొంగలు గురువారం తెల్లవారుజాములో పక్కన, పైన ఉన్న ఇళ్లకు, బయట గడియ పెట్టి ఇంట్లోకి ప్రవేశించారు. శుక్రవారం ఉదయం పైనున్న ఇంటి యజమానులు తలుపు తెరిచేందుకు ప్రయత్నించగా తలుపు రాకపోవడంతో పక్కింటి వారి సాయంతో గడియ తీయించుకుని బయటకు వచ్చి గమనించగా చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే సుభాషిని దంపతులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి చూసి ఇంట్లో ఉంచిన 16 తులాల బంగారు ఆభరణాలు, రూ. 40 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితులు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు చోరీ జరిగిన ఇంటికి వెళ్లి పరిశీలించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులు సీజ్

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలం పరిధిలో ఎనుములవారిపల్లికి చెందిన సూర్యనారాయణ రెడ్డి అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పట్నం ఎస్ఐ నరసింహుడు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు సమస్యాత్మకమైన గ్రామాల్లో తనిఖీలు చేస్తుండగా సూర్యనారాయణ రెడ్డి ఇంటి వెనుక భాగంలో ఉన్న గదిలో ఉంచిన టపాసులను గుర్తించామన్నారు. గదిలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.70వేల విలువగల టపాసులను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

రైలు కింద పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

కొత్త చెరువులోనే బీసీ కాలనీకి చెందిన యువకుడు శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... బీసీ కాలనీకి చెందిన మల్లెల వెంకటరాముడు కుమారుడు మల్లెల హరి (26) శుక్రవారం సాయంత్రం మూడు గంటల సమయంలో రైల్వే సొరంగం వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. హరి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సుందన్నారు.

వృద్ధుడు ఆత్మహత్య

గుత్తి : మండలంలోని జక్కలచెరువు రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ కానిస్టేబుళ్లు వాసు, నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 65 ఏళ్ల వృద్ధుడు రైల్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్ల అంగి, పంచ వృద్ధుడు ధరించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించామని వెల్లడించారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

గుత్తి : స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. రైలు ప్రయాణికులు కింద పడేసిన ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు సేకరించి విక్రయించుకునే వృద్ధుడు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే జీఆర్పీ కానిస్టేబుళ్లు వాసు, నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సబిహా ట్రేడర్స్‌లో చోరీ

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న సబిహా స్టీల్ అండ్ ఐరన్ ట్రేడర్స్ దుకాణంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. దొంగ దుకాణం వద్ద నిద్రించినట్లు నటించి ఇనుప రాడ్డుతో షట్టర్‌కు ఉన్న తాళాలను తొలగించాడు. లోనికి ప్రవేశించి అందులో ఉన్న రూ.12 వేలు నగదు, సెల్ ఫోన్ దోచుకుని వెళ్లాడు. ఈ చోరీ దృశ్యాలన్నీ సీసీ పుటేజీలో రికార్డయ్యాయి. ఉదయం షాపునకు వచ్చిన యజమాని మైను గమనించగా తాళాలు ఓపెన్ చేసి ఉండటంతో ఒక్కసారిగా ఖంగుతున్నాడు. లాకర్‌లో ఉన్న డబ్బు లేకపోవడంతో చోరీ జరిగినట్టు భావించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ బి.నబిరసూల్ ఘటనా స్థలాన్ని పరిశీలించి సీసీ పుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు.

విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్ పరిశీలన

ప్రజాశక్తి - ముదిగుబ్బ

రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఎడిఎ

మండలంలోని జొన్నల కొత్తపల్లి, సంకేపల్లి గ్రామాలలోని రైతుభరోసా కేంద్రాల్లో జరుగుతున్న వేరుశనగ విత్తన రిజిస్ట్రేషన్ పక్రియను కదిరి వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. కె-6, కదిరి - 1812(వేమన), టి సి జి యస్ 1694 (వశిష్ట)వేరుశనగ రకాలు అందుబాటులో ఉన్నాయని ఈసందర్భంగా ఆయన చెప్పారు. ప్రభుత్వ విత్తన కాయలను దుర్వినియోగం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి లక్ష్మి నరసింహులు, ఎఇఒ షరీఫ్, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

నేలకొరిగిన వందేళ్ల వేపచెట్టు

పుట్లూరు : మండలంలో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు మండలంలోని కందికాపుల గ్రామంలో ఉన్న రచ్చకట్ట వంద నూరేళ్ల పైబడిన వేపచెట్టు నేలకొరిగింది. అయితే ఆ సమయంలో చెట్టు కింద ఎవరూ లేకపోవడంతో ప్రాణాప్రాయం తప్పింది. కానీ విద్యుత్ వైర్లు తెగిపోయాయి. కరెంటు లేకపోవడంతో ఏ ప్రమాదం చోటు చేసుకోలేదు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-వజ్రకరూరు

కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతూ, మానసిక క్షోభకు గురి చేస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కాంట్రాక్టర్ సుధాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ జవహర్‌కుమార్, డిఇ శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మిక యూనియన్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ రాఘవేంద్రప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణదుర్గం, రాయదుర్గం పరిధిలో పని చేస్తున్న కార్మికులకు ఇచ్చే జీవితంలో రూ.2,220 కోత విధించడాన్ని నిరసిస్తూ ఈనెల 18న సాయంత్రం స్వచ్ఛందంగా కార్మికులందరూ ఏకమై ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు మోటార్లు రన్నింగ్‌లో ఉన్నప్పుడే అప్పగించినట్లు ఇళ్లకు వెళ్లారన్నారు. అయితే అదేరోజు రాత్రి ఆర్‌డబ్ల్యూఎస్ పంపు ఆపరేటర్ వన్నూరుస్వామి ఇంటి వద్దకు రాత్రి 11 గంటల సమయంలో వెళ్లి వచ్చి మోటార్లు ఆన్ చేసి విధుల్లో చేరాలని, లేనిపక్షంలో విధుల నుంచి తొలగిస్తామని భయాందోళనకు గురి చేయడం బాధాకమరమన్నారు. అదేవిధంగా మరికొంతమంది కార్మికులను ఇళ్లకు వెళ్లి బెదిరించారన్నారు. అడ్డొచ్చిన మహిళలను సైతం చెప్పరాని మాటలతో దుర్భాషలాడారని వాపోయారు. అలాగే పిఎబిఆర్ డ్యామ్‌లో విధులు నిర్వహిస్తున్న హెల్పర్ హరీష్ తనకు రావాల్సిన జీతం ఇవ్వాలని కాంట్రాక్టర్ సుధాకర్‌రెడ్డిని అడగడంతో తననే జీతం అడుగుతావా అంటూ భౌతిక దాడులకు దిగాడన్నారు. దీంతో కార్మికులందరూ కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారన్నారు. చాలీచాలని జీతాలతో ఏళ్ల తరబడి పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్మికులను కక్ష సాధింపులకు పాల్పడుతున్న కాంట్రాక్టర్ సుధాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, శ్రీరామిరెడ్డి కార్మిక సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

'పివికెకె'కు న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు

ప్రజాశక్తి-అనంతపురం

16ఏళ్లుగా జిల్లాలో ఎంతోమంది విద్యార్థులను అతున్నత ప్రమాణాలతో విద్యావంతులుగా తీర్చిదిద్దిన పివికెకె ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ కమిటీ ఏ గ్రేడ్ గుర్తింపు లభించింది. దేశంలోని ఉన్నత విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలను పెంపొందించడానికి ఏర్పాటు చేసినస యుజిసి న్యాక్ బృందం గతంలో పివికెకె కళాశాలను సందర్శించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కమిటీ నిపుణులు విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యంతో సంభాషించి అందరి అభిప్రాయాలను తీసుకుంది. అంతేగాకుండా కళాశాలలో విద్య, వసతులు, పాఠ్య ప్రణాళిక రూపకల్పన, అమలు, విద్యాబోధన స్థాయి, పరిశోధన దిశగా పురోగతి, మౌలిక సదుపాయాలు, విద్యార్థి పురోగతి, కళాశాల విశ్వసనీయత, అత్యున్నత ప్రమాణాలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉన్నత విద్యార్హతలు కలిగిన ఆచార్యుల నిష్పత్తి తదితర పలు అంశాలను పరిశీలించి పివికెకె కళాశాలకు ఏ గ్రేడ్ కళాశాలగా గుర్తింపు ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్ మట్లాడుతూ అతిత్వరలో పివికెకె ఐటీ అటానమస్ కళాశాలగా గుర్తింపు పొందుతోందని తెలిపారు.